క్లుప్తంగా

వాటర్ ట్యాంక్ ప్రారంభించిన ఎమ్మెల్యే



బిక్కవోలులో వాటర్ ట్యాంక్ ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో జల జీవన్ మిషన్ నిధులు రూ.1.33 కోట్లతో నిర్మించిన వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ గ్రామంలో ప్రజల తాగునీటి సమస్య తీరిందన్నారు. ప్రభుత్వం ఒకపక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముందుకెళుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, సర్పంచ్ సరెళ్ళ సుమలత, గువ్వల సత్తిరెడ్డి, గరగా వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే డిజిటల్ విధానం

బిక్కవోలు: పారదర్శకంగా ఇంటి పన్నులు వసూలు చేయడం కోసం ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని ప్రవేశపెట్టిందని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆన్‌లైన్ ద్వారా పన్నులు వసూలు చేయడాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో పన్ను రూపేణా రూ.24,99,321 వసూలు చేయాల్సి ఉందని, గ్రామ ప్రజలందరూ ఆన్‌లైన్ ద్వారా నగదు రహిత చెల్లింపు చేయాలని కోరారు. కార్యక్రమంలో తొస్సిపూడి పంచాయతీ కార్యదర్శి అచ్చియ్య చౌదరి, గుమస్తా ఎం.సూర్యనారాయణ, సూరిశెట్టి సురేష్, సీహెచ్ రాధ తదితరులు పాల్గొన్నారు.

సారాబట్టీలపై దాడి



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

సీతానగరం: బొబ్బిల్లంక లంకభూముల్లో నిర్వహిస్తున్న సారాబట్టీలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జి.సత్యనారాయణ, రాజమహేంద్రవరం నార్త్ ఎస్‌ఈబీ సీఐ పీవీ రమణ, కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావుల ఆధ్వర్యంలో మంగళవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 4,800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎస్‌ఈబీ ఎస్సై టి.నిరంజన్‌రావు, సీతానగరం ఎస్సై కె.చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

వేంద్రలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

పెదపూడి: మండలంలోని వేంద్ర గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.విజయభాస్కర్ మంగళవారం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌ఐను కలిసిన కాపునాడు నాయకులు



ఎస్‌ఐ విజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కాపునాడు నాయకులు

రంగంపేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రంగంపేట ఎస్‌ఐ పి.విజయ్‌కుమార్‌ను మండల కాపునాడు నాయకులు మంగళవారం కలిశారు. రంగంపేట ఎస్‌ఐగా విజయ్‌కుమార్ ఇటీవల బాధ్యతలు చేపట్టడంతో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కాపునాడు అధ్యక్షుడు మాగాపు కాశిబాబు, ద్వారంపూడి సూర్యచంద్ర చక్రవర్తి పాల్గొన్నారు.

కలశ యాత్ర ర్యాలీలు

సీతానగరం: నా భూమి– నాదేశం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో కలశ యాత్ర ర్యాలీలు నిర్వహించారు. సీతానగరంలో సర్పంచ్ కోండ్రపు ముత్యాలు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కె.రమేష్ పాల్గొన్నారు. గ్రామంలో మట్టిని సేకరించి కలశాలలో ఉంచి ర్యాలీ చేశారు. ఏపీవో నాగ శేషవేణి, పంచాయతీ కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

రంగంపేట: మండలంలోని దొంతమూరులో నిర్వహించిన తనిఖీల్లో మేకా భాస్కరరావు అనే వ్యక్తి 10 లీటర్ల సారా కలిగి ఉండటంతో అతడిని అరెస్ట్ చేశామని ఎస్‌ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి మంగళవారం తెలిపారు. అతడిపై కేసు నమోదుచేసి పెద్దాపురం కోర్టులో హాజరు పరచగా రిమాండు విధించినట్టు తెలిపారు.

కూడలిలో ధ్వజస్తంభం.. ఊరికి ప్రత్యేకం

- ఇనగంటివారిపేటలో ఏర్పాటు
- ఆకట్టుకుంటున్న పెరుమాళ్ల ధ్వజస్తంభం

సీతానగరం: సాధారణంగా ఆలయాల్లో ధ్వజస్తంభాలను ప్రతిష్ఠిస్తారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ పద్ధతి ఇలాగే ఉంటుంది. అయితే సీతానగరం మండలం ఇనుగంటివారిపేట గ్రామంలో ప్రధాన కూడలి మధ్యలో పెరుమాళ్ల ధ్వజస్తంభం ఉంది. దాదాపు 86 ఏళ్ల క్రితం దీనిని ప్రతిష్ఠించారు. అనంతరం శిథిలావస్థకు చేరుకోవడంతో పునఃప్రతిష్ఠ చేశారు. ప్రధానంగా విష్ణాలయం, శివాలయం, రామాలయం వంటి పలు దేవాలమూర్తుల ఆలయాల వద్ద ధ్వజస్తంభం ఉంటుంది. అయితే ఇనుగంటివారిపేటలో మాత్రం పలు ఆలయాలు ఉన్నా, వాటి వద్ద ధ్వజస్తంభం లేదు. గ్రామం నడిబొడ్డున దర్శనమిస్తుంది.

1933లో..

పూర్వకాలంలో ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట గ్రామాలు ఇనుగంటి మహారాజు పాలనలో ఉండేవి. ముగ్గళ్లలో శివాలయం ఉన్నందున, అక్కడ ధ్వజస్తంభం ఉంది. శైవ, వైష్ణవ ఆయమాలను అనుసరించి ఏ గ్రామంలోనైనా శివాలయం లేదా ధ్వజస్తంభం ఉండాలి. దానిని అనుసరించి 1933లో గ్రామ పెద్దలు గ్రంధి పుల్లయ్య, సత్యం మావయ్య కాపు, బిక్కిన వెంకట్రావు ఆగమాలను అనుసరించి, గ్రామం నడిబొడ్డులోని కూడలిలో పెరుమాళ్ల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. దీనివల్ల గ్రామం సుభిక్షంగా ఉంటుందని, అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని నమ్మకం.

ఊరి మధ్యలో..

ఊరి మధ్యలో ఉన్న పెరుమాళ్ల ధ్వజస్తంభానికి ఉత్తర, దక్షిణ దిక్కులలో రామాలయాలు, తూర్పున శాంతిదుర్గ ఆలయం, పడమర గ్రామ దేవత లంకాలమ్మ కొలువై ఉన్నారు. ఇవే కాకుండా గ్రామంలో లక్ష్మీ గణపతి, షిర్డీసాయిబాబా, భక్తాంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. కానీ వాటిలో ఎక్కడా ధ్వజస్తంభం ప్రతిష్ఠించలేదు. పన్నెండేళ్ల క్రితం ముగ్గళ్ల పంచాయతీ నుంచి విడిపోయి ఇనుగంటివారిపేట పంచాయతీగా మారింది. 1933లో ప్రతిష్ఠించిన పెరుమాళ్ల ధ్వజ స్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తుల సహకారంతో 2019 జూన్ 20న పునఃప్రతిష్ఠించారు.

> **ఎంతో విశిష్టత**
>
> 
>
> దాదాపు 90 ఏళ్ల క్రితం గ్రామం కూడలిలో పెరుమాళ్ల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కాలక్రమీణా శిథిలావస్థకు చేరుకోవడంతో 2019 జూన్‌లో పునఃప్రతిష్ఠించారు. ఈ ధ్వజస్తంభం వద్దకు వచ్చి మొక్కుకుంటే, అనుకున్న పని జరుగుతుందని, విజయం చేకూరుతుందని ప్రగాఢ నమ్మకం. గ్రామం మధ్యలో ఉన్న ఈ ధ్వజస్తంభం ఎంతో విశిష్టమైనది.
>
> – ఆరాధ్యుల సాయికుమార్, ఇనుగంటివారిపేట



ఇనుగంటివారిపేట గ్రామంలో నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న పెరుమాళ్ల ధ్వజస్తంభం

నేడు భూమి పూజ

రంగంపేట: మండలంలోని జి.దొంతమూరు, ఎస్టీ రాజాపురం గ్రామాల్లో ఎంపీ నిధులతో నిర్మించనున్న మల్టీపర్పస్ భవనాల నిర్మాణాలకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం భూమి పూజల చేయనున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, మండల పంచాయితీ రాజ్ జేఈ కె.శ్రీనివాసరావులు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు హాజరవ్వాలని వారు కోరారు.

ఇంటర్ విద్యార్థుల సర్టిఫికెట్లు సిద్ధం

రంగంపేట: ఈ ఏడాది మార్చిలో జరిగిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఇంటర్ విద్యార్థుల సర్టిఫికెట్లు కళాశాలలో సిద్ధంగా ఉన్నాయని రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్లు ఇటీవలే కళాశాలకు చేరాయని, విద్యార్థులు కళాశాల పని దినాల్లో వచ్చి తీసుకెళ్లొచ్చన్నారు.

మండలంలో ఈకేవైసీ నూరు శాతం పూర్తి

పెదపూడి: మండలంలో ఈకేవైసీ నూరు శాతం పూర్తయిందని మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. మంగళవారం ఆయన ఏపీత్రయం రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మణిదీప్ మాట్లాడుతూ మండలంలో 18000 ఎకరాల్లో వరిసాగు చేస్తున్న 12,132 మంది రైతుల నుంచి ఈకేవైసీ నమోదు చేసి ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. ఈ–క్రాప్ నమోదు వల్ల ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పొందడానికి అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీత్రయం సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



ఏపీత్రయం రైతు భరోసా కేంద్రంలో ఏఓ మణిదీప్

భాగవత గ్రంథం వితరణ

గోకవరం: అచ్యుతాపురం గ్రామంలో సనాతన ధర్మ ప్రబోధనా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సహస్ర భాగవత గ్రంథం వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొని గ్రామస్తులకు భాగవత గ్రంథాలను అందజేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, ప్రధాన కార్యదర్శి అక్షింతల రాజాలు మాట్లాడుతూ భాగవత గ్రంథం ప్రతి ఒక్కరినీ తరిస్తుందన్నారు. అనంతరం ఎంపీపీ దంపతులను సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కొత్తపల్లి సత్యనారాయణ, అమరా యతిరాజులు, కొత్తపల్లి ప్రసాద్, బొద్దపు చంద్రరావు, దోసపాటి సుబ్బారావు, పిల్లంగోరు పాపారావు తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు గ్రంథాలను అందజేస్తున్న ఎంపీపీ శ్రీవల్లి దంపతులు

ఈ-క్రాప్, ఈ-కేవైసీలో ప్రథమ స్థానం

సీతానగరం: నూరుశాతం ఈ–క్రాఫ్ బుకింగ్, ఈ–కేవైసీలో సీతానగరం మండలం జిల్లాలో ప్రథమస్థానంలో ఉందని మండల వ్యవసాయశాఖాధికారి కె.సూర్యరమేష్ మంగళవారం తెలిపారు. మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల్లో 18 మంది సిబ్బంది పనిచేస్తున్నారని, వారందరూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆర్బీకేల ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. చిన కొండేపూడి 2 వీఏఏ మాత్రమే మెటర్నిటీ లీవ్‌లో ఉన్నారని వివరించారు. అన్ని గ్రామాల్లోనూ పంటలకు సరిపడా ఎరువులు కియోస్క్ ద్వారా అందుబాటులో ఉంచామన్నారు.

వీసీ ఆచార్య పద్మరాజుకు ఆహ్వానం

రాజానగరం: రాజరాజ నరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాల నీరాజనంగా గైట్ కళాశాల ప్రాంగణంలో జనవరి 5 నుంచి మూడు రోజులు నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలకు విచ్చేసి, యూనివర్సిటీ తరఫున పూర్తి సహాయ, సహకారాలు అందించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె. పద్మరాజును ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు యూనివర్సిటీలో మంగళవారం వీసీని కలుసుకుని మహాసభలకు సంబంధించిన ఆహ్వానాన్ని అందజేశారు. పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ మహాసభలు జరుగనున్నాయంటూ వాటికి సంబంధించిన విశేషాలను వివరించారు.



వీసీ ఆచార్య పద్మరాజుకు మహాసభల ఆహ్వానాన్ని అందజేస్తున్న డాక్టర్ గజల్ శ్రీనివాస్

ప్రజా ప్రయోజనాల కోసమే గడప గడపకూ

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బిక్కవోలులో గడప గడపకూ మన ప్రభుత్వం



బిక్కవోలులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ప్రజా ప్రయోజనాల కోసమే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బిక్కవోలులో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామన్నారు. ప్రజలకు అన్ని విధాల మేలు చేస్తున్న సీఎం జగన్‌కు రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జంగావీర వెంకట సుబ్బారెడ్డి, సర్పంచ్ సరెళ్ల సుమలత, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, గువ్వల సత్తి రెడ్డి, జామి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మహర్దశ



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కలిసిన పురావస్తుశాఖ అధికారులు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- రంగంలోకి పురావస్తు శాఖాధికారులు
- కోరుకొండలో ఆలయాల పరిశీలన
- త్వరలోనే అనుమతులు
- ఫలించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి, రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా దేవాలయాలను మంగళవారం పురావస్తుశాఖాధికారులు సందర్శించారు. నరసింహస్వామి ఆలయ ఐదంస్తుల రాజగోపురంతో పాటు రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున శ్రీవాణి పథకంలో భాగంగా ఇదివరకే నిధులు మంజూరు చేయించారు. ఇది పురాతన ఆలయ కావడంతో పురావస్తుశాఖ నుంచి కూడా అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సూచనల మేరకు పురావస్తుశాఖ డిప్యూటీ డైరెక్టర్ సురేష్, ఏటీలు వెంకట్రావు, తిమ్మరాజు, అన్నవరం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాళం మురళీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గుర్రాజు తదితరులతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. వంశపారంపర్య ధర్మకర్త ఎస్పీ రంగరాజు బట్టర్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుని మరిన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆలయ నిర్మాణానికి అనుమతులు త్వరతగతిన మంజూరు చేస్తామని తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రాజానగరం: ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఆసరాగా నిలుస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. నియోజకవర్గంలోని 10 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.12.53 లక్షలకు సంబంధించిన చెక్కులను రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో మంగళవారం అందజేశారు. రాజానగరం మండలం సూర్యారావుపేటకు చెందిన కరినికికోట సత్యవతికి రూ.68 వేలు, నరేంద్రపురానికి చెందిన గెట్టం ఫణీంద్రకు రూ.45 వేలు, కలవచర్లకు చెందిన గణపతిరాజు కాశీకి రూ.1.50 లక్షలు, కానవరానికి చెందిన సంగీత జీవన్‌కి రూ.1.60 లక్షలు మంజూరయ్యాయి. కోరుకొండ మండలం మునగాలకు చెందిన మండపాక వీరప్రభావతికి రూ.70 వేలు, కణుపూరుకు చెందిన నల్లాల సూర్య సతీష్‌కు రూ.1.10 లక్షలు, సీతానగరం మండలం మిర్తిపాడుకు చెందిన బుల్లి పాపాలక్ష్మికి రూ.1.10 లక్షలు, రాజమహేంద్రవరానికి చెందిన చప్పటి వీర వెంకట శ్రీనివాసరావుకు రూ.4 లక్షలు, కాకినాడ సమీపంలోని తూరంగికి చెందిన నామ శివసతీష్‌కి రూ.1.20 లక్షలను సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అందజేశారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యసేవలు

సీతానగరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ముగ్గళ్ల సచివాలయంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఏవీకే చైతన్య, రాజు, మేఘన, ఏసురాణి సుమారు 609 మందికి వైద్యసేవలు అందించారు. ఇందులో 30 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. షుగర్, బీపీ, ఈసీజీ, టీబీ తదితర పరీక్షలు చేశారు. 142 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యసేవలు అందించారు. రోగులకు అవసరమైన మందులకు ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఎంపీడీవో కె.రమేష్, వైద్యుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాళ్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, ఎంపీహెచ్‌ఎస్ కె.సుధాకర్, సుంకర నగేష్ బాబు, స్వామి పాల్గొన్నారు.

ఇటికాయలపల్లిలో..

గోకవరం: ఇటికాయలపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సుంకర వీరబాబు, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌ఛార్జి గుల్లా ఏడుకొండలు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 519 మంది వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు, స్థానిక నాయకులు కండేపల్లి రాంబాబు, తుపాకుల నాగేశ్వరరావు, ఎంపీటీసీ గల్లా కృష్ణ, డాక్టర్లు అనూష, వికాస్, సునీల్, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

పెదరాయవరంలో..

రంగంపేట: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. మండల పరిధిలోని పెదరాయవరం సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. శిబిరంలో 550 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బరగటి సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు మాచిన మమతారాణి, పీహెచ్‌సీ డాక్టర్ జి.రామ్‌భాస్కర్, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యం పదిలం అని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని ఆరికరేవుల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 457 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆరోగ్యం మెరుగుకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి నాగవీరవేణుకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ముగ్గళ్లలో రోగులకు మందుల కిట్లు అందిస్తున్న ఎంపీపీ జ్యోత్స్న, వైద్యాధికారులు



పెదరాయవరం వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

సీతానగరంలో ఉపాధి గ్రామసభ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం సచివాలయం వద్ద మంగళవారం ఉపాధి హామీ పథకం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కోండ్రపు ముత్యాలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్.సుజాత, ఏపీవో నాగ శేషవేణి 2024 – 25 ఏడాదికి చేపట్టే పనులను గుర్తించి, గ్రామసభలో ఆమోదించారు. ఉద్యానవన పంటలుగా మునగ మొక్కల పెంపకం, రైతుల పొలాల్లో నీటి కుంటలు, కందకాలు, పంట బోదెలు, పంట కాలువలో పూడిక తీయడం, పొలాలకు వెళ్లడానికి మట్టి రోడ్డుల నిర్మాణం వంటి పనులు చేయడానికి తీర్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సలాది వాసు, ఎన్ఆర్‌జీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ఎం.శంకరయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణవేణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

శిక్షణను వాయిదా వేయాలి

కంబాలచెరువు: దసరా సెలవుల్లో ప్రాథమిక ఉపాధ్యాయులకు రెండో విడతగా జరగనున్న ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) శిక్షణ తరగతులు వాయిదా వేయాలని యూటీఎఫ్ జిల్లా శాఖ కోరింది. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరం ఉప విద్యాశాఖాధికారి ఈవీవీఎస్ఎన్ నారాయణను జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, షరీఫ్, కోశాధికారి ప్రసాద్‌లు కలిసి విజ్ఞప్తి చేశారు. దసరా అనంతరం షెడ్యూల్ ఇవ్వాలని కోరారు.

విషయ పరిజ్ఞానం ఎంతో ముఖ్యం

రాజానగరం: పరీక్షల్లో మార్కులు సాధించడం కన్నా విషయ పరిజ్ఞానం ఎంతో ముఖ్యమని గైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వల్లీమాధవి అన్నారు. కళాశాలలో హుమనిటీస్ అండ్ బేసిక్ సైన్సెస్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నేటి విద్యావిధానంపై విద్యార్థుల అభిప్రాయం అనే అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. మార్కులనే ఆధారంగా చేసుకుని చాలామంది ఉన్నత స్థాయి చేరుకుంటున్నారని కొందరు, మార్కులు ఎక్కువగా వచ్చినప్పటికీ వారిలో సరైన నైపుణ్యాలు లేవకపోతే ఉన్నతస్థాయిని చేరుకోవడం, లక్ష్యాలను సాధించడం కష్టమని మరికొందరు విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మీరు చదువుకునే పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన ఉంటే విషయ పరిజ్ఞానం ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రయ్య, హెచ్ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అత్యంత ప్రాధాన్యం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

- జక్కంపూడి విజయలక్ష్మి
- నూతన కార్యవర్గానికి అభినందనలు

సీతానగరం: జగన్ ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. రాపాకలో నాయీ బ్రాహ్మణుల సేవాసంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం ద్వారా కులవృత్తులు చేసుకునే వారికి ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నారన్నారు. నాయీ బ్రాహ్మణులకు ఆలయ ట్రస్ట్‌బోర్డులలో కూడా అవకాశం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తాము ఇచ్చిన హామీ మేరకు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నాలుగు సెంట్ల స్థలం కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడిగా సుందరపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శిగా కణితి నాగరాజు, ఉపాధ్యక్షులుగా కడపకల్లు త్రిమూర్తులు, సందరపల్లి మురళీ, లావేటి సురేష్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, పిచ్చుకల రవికుమార్, విజయ్ కుమార్, సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్టాబత్తుల నాగబాబు, గౌరవ అధ్యక్షుడు అందనాపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.